సంపుటి :03 | సంచిక :58 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

శనివారం 11, ఏప్రిల్ 2026

## ఎన్నికల లబ్ధి కోసమే హైడ్రామా

- మహిళా లోకానికి ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి
- -రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

03




# డీలిమిటేషన్ సెగ

- ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లు భౌగోళిక మార్పులపై సర్వత్రా చర్చ
- కొత్త నియోజకవర్గాల కోసం తెరపైకి ఉద్యమం.. గూడూరులో మొదలైన పోరు
- గూడూరును అసెంబ్లీ కేంద్రం చేయాలనే డిమాండ్‌తో జేఏసీ ఆందోళన
- మరికొన్ని ప్రాంతాల్లోనూ ఉద్యమానికి రూపుదిద్దుకుంటున్న ప్రణాళికలు
- ఉమ్మడి వరంగల్ లో నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీలిమిటేషన్ సెగ అప్పుడే మొదలైంది. కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన దిశగా అడుగులు వేస్తూ, చట్టసభల్లో సీట్ల సంఖ్యను 50 శాతం పెంచే యోచనలో ఉండటంతో జిల్లా రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. ఈ మార్పుల వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 12 నుంచి గరిష్ఠంగా 21కి చేరే అవకాశం ఉండటంతో, అటు రాజకీయ నేతల్లో ఇటు ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కొత్తగా ఏయే మండలాలు కలుస్తాయి? ఏయే నియోజకవర్గాలు ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వ్ అవుతాయి? అనే చర్చ సామాన్యుల నుంచి సచివాలయం వరకు సాగుతోంది. ఈ క్రమంలోనే తమ ప్రాంతాన్నే నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ గూడూరు లాంటి ప్రాంతాల్లో జేఏసీల ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు తెరపైకి వస్తున్నాయి. ఒకవైపు ఆశావాహులు కొత్త సీట్ల కోసం క్షేత్రస్థాయిలో పావులు కదుపుతుండగా, మరోవైపు భౌగోళిక మార్పులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

–అక్షరదర్బార్, వరంగల్

2




- పెరుగనున్న అసెంబ్లీ స్థానాలు.. అప్పుడే ఆశావాహుల వేట

## నిర్లక్ష్యం వీడండి.. సురక్షితంగా ఇంటికి చేరండి

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- కాళోజి కళాక్షేత్రంలో ఘనంగా 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత సదస్సు
- వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం
- పాల్గొన్న కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, డా సత్య శారద, సీపీ సన్‌ప్రీత్ సింగ్

4



## కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసు

- 48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్
- రూ.30 కోట్ల అవినీతి ఆరోపణలే మూలం

02



# డీలిమిటేషన్ సెగ

## కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసు

- 48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్
- రూ.30 కోట్ల అవినీతి ఆరోపణలే మూలం

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరి న్యాయపోరాటానికి దారితీసింది. అంగన్‌వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలులో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ చేసిన ఆరోపణలపై రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆమె లీగల్ నోటీసులు జారీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన మొబైల్ ఫోన్ల టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ పార్టీ తన అధికారిక సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు గుప్పించింది. మొత్తం రూ.44 కోట్ల విలువైన ఈ టెండర్లలో రూ. 30 కోట్లు పక్కదారి పట్టాయని, ఇందులో మంత్రి సీతక్క హస్తం ఉందంటూ బీఆర్ఎస్ శ్రేణులు ప్రచారం చేశాయి. బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. తన రాజకీయ జీవితంపై బురద చల్లేందుకే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వ సంస్థ అయిన తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ పూర్తి పారదర్శకంగా నిర్వహించిందని, ఇందులో మంత్రిగా తనకు ఎలాంటి వ్యక్తిగత జోక్యం లేదని స్పష్టం చేశారు.

**- క్షమాపణకు గడువు**

తన ప్రతిష్టకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను 48 గంటల్లోగా తొలగించాలని, కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిర్ణీత సమయంలోగా స్పందించకుంటే కేసీఆర్‌తో పాటు పార్టీ సోషల్ మీడియా విభాగంపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలను కేవలం ప్రెస్ మీట్లతో సరిపెట్టకుండా, నేరుగా ప్రతిపక్ష నేతకే లీగల్ నోటీసులు పంపడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



## ఆరోగ్యవంతమైన పౌరుల నిర్మాణమే లక్ష్యంగా పౌష్టికాహారం

- అంగన్వాడీ కేంద్రంలో వంటల పోటీలు.. బహుమతుల ప్రధానం
- మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్



అక్షర దర్బార్, నర్సంపేట: గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ సూచించారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం 2వ నంబర్ అంగన్వాడీ కేంద్రంలో టీచర్ గొర్రె రాధమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పాలు, పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాలలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని కోరారు. అనంతరం తల్లులకు నిర్వహించిన వంటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పొన్నాల మనిషా ప్రకాష్, నల్ల భారతి, రామగోని సౌందర్య, అపరాధపు సంధ్య, దార్ల చంద్రమ్మ, సూపర్వైజర్ గుంటి కవిత, ఆర్పీ దాసరి రమాదేవి, హెల్త్ అడ్వైజర్ సునీత, కమిటీ సభ్యులు పోశాల మమత, సామల ఉమా, మెర్గు లలిత, అంగన్వాడీ సిబ్బంది విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

- కొత్త నియోజకవర్గాల కోసం తెరపైకి ఉద్యమం.. గూడూరులో మొదలైన పోరు
- -గూడూరును అసెంబ్లీ కేంద్రం చేయాలనే డిమాండ్ తో జేఏసీ ఆందోళన
- -మరికొన్ని ప్రాంతాల్లోనూ ఉద్యమానికి రూపుదిద్దుకుంటున్న ప్రణాళికలు
- -ఉమ్మడి వరంగల్ లో నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ

- పెరగనున్న అసెంబ్లీ స్థానాలు.. అప్పుడే ఆశావాహుల వేట
- ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లు భౌగోళిక మార్పులపై సర్వత్రా చర్చ







అక్షరదర్బార్, వరంగల్ : నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ప్రస్తుతం దేశంలో ఉన్న పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యపై 50 శాతం సీట్లను పెంచాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుతోపాటు లోక్ సభ, శాసనసభ నియోజకవర్గాల సీట్ల పెంపు బిల్లు కోసం ఈనెల 16, 17, 18 తేదీల్లో ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగటం, లోకసభ, శాసనసభ నియోజకవర్గాల సీట్లు పెరగటం ఖాయమని కనిపిస్తుంది. దీంతో అప్పుడే క్షేత్రస్థాయిలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఉత్కంఠ చోటుచేసుకుంది. ప్రధానంగా కొత్తగా ఏర్పడే అసెంబ్లీ స్థానాలు, ఎస్సీ ఎస్టీల తోపాటు మహిళలకు రిజర్వ్ అయ్యే స్థానాలు, ఆయా నియోజకవర్గం భౌగోళిక మార్పులపై ఆసక్తికర చర్చ జరుగుతుంది. అంతేకాదు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే నువ్వులాటంతో ఉన్న పోటీ చేసేందుకు ఇన్నాళ్లు అవకాశం లభించని ప్రధాన రాజకీయ పార్టీల నేతలు నియోజకవర్గం నియోజకవర్గాల పునర్విభజనతో అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగేందుకు ఉత్సాహం కనబరుస్తున్న ఆశావాహులు ప్రజలతో మమేకం అయ్యే పనిలో ఉన్నారు తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతంలో కొత్తగా ఏర్పడే అవకాశం ఉన్న కలిగిన మండలాలపై డివిజన్లపై దృష్టి సారించారు. ఇదే సమయంలో కొత్తగా నియోజకవర్గ కేంద్రాల కోసం ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఆందోళన బాట పడుతుండటం విశేషం. తాజాగా గూడూరు మండల కేంద్రం కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో గూడూరు నియోజకవర్గ సాధన జాయింట్ యాక్షన్ కమిటీ సోమవారం ర్యాలీ నిర్వహించి మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ ను కలిసింది.

### టెన్షన్.. టెన్షన్

డీలిమిటేషన్ పై ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ప్రస్తుతం ఉన్న పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల సంఖ్యపై నియోజకవర్గాల పునర్విభజనతో 50 శాతం సీట్లు పెరగనున్నందున ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ స్థానాలకు తోడు కొత్తగా ఎన్ని శాసనసభ స్థానాలు రావచ్చు?, కొత్తగా ఏర్పడే శాసనసభ నియోజకవర్గాలు ఏవి కావచ్చు?, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ఏ నియోజకవర్గాలు రిజర్వుకానున్నాయి?, ఆయా నియోజకవర్గం భౌగోళిక స్వరూపం ఎలా ఉండబోతుంది? తదితర అంశాలపై సర్వత్రా చర్చ నడుస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2016లో జిల్లాల పునర్విభజన జరిగిన సమయంలో పొరుగున ఉన్న కరీంనగర్, ఖమ్మం జిల్లాల నుంచి కొన్ని మండలాలు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోకి వచ్చాయి, దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనాభా పెరిగింది. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యపై 50 శాతం పెంపునకు కేంద్రం నిర్ణయం తీసుకుంటే జనాభా పెరిగిన దృష్ట్యా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు నుంచి 8 వరకు అంటే 18 నుంచి 21 వరకు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే వీటిలో ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు ఏ నియోజకవర్గాలు రిజర్వ్ కావచ్చు అంశం కూడా హాట్ టాపిక్ గా మారింది. దీనికి తోడు ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాల భౌగోళిక స్వరూపం కూడా మారనుంది. ఈ క్రమంలో కొత్త నియోజకవర్గం ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్న ప్రాంతాల్లోని మండలాలు, డివిజన్లపై ఆశావాహులు అప్పుడే దృష్టిసారించి ప్రజలతో మమేకం అవుతున్నారు. ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాల పేరుతో నేనున్నాను అనే చెప్పేలా ప్రజలను కలుస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన చర్చతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్న నేతలు తెరపైకి వస్తున్నారు.

### ఉద్యమ బాట

నియోజకవర్గాల పునర్విభజనతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా ఏర్పడనున్న నియోజకవర్గాలపై ఊహాగానాలు వినపడుతున్నాయి. దీంతో తమ మండల కేంద్రం కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో స్థానికులు రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ సాధనకు జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరిలో మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు మండల ప్రజలు ముందు ఉన్నారు. ప్రస్తుతం గూడూరు మండలం మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉంది. అయితే నియోజకవర్గాల పునర్విభజనలో కొత్తగా గూడూరు మండల కేంద్రం కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని గూడూరు మండల ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతంగా నియోజకవర్గ సాధన జేఏసీని ఏర్పాటు చేసుకుని ఆందోళన బాట పట్టారు. ఈ డిమాండ్ తో గూడూరు మండలంలోని గ్రామపంచాయతీలూ ఏకగ్రీవ తీర్మానాలకు శ్రీకారం చుట్టాయి. జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గూడూరు మండల ప్రజలు సోమవారం మహబూబాబాద్ లో ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ ని కలిశారు. కాకతీయుల చరిత్ర కలిగిన గూడూరు కేంద్రంగా కొత్త అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో తాలూకా, సమితి కేంద్రంగా ఉన్న గూడూరు ఇన్నాళ్లు నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పుడు గూడూరు నియోజకవర్గం సాధన కోసం రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, వివిధ రాజకీయ పార్టీల నేతలను, డీలిమిటేషన్ కమిటీని కలుస్తామని ప్రకటించారు. గూడూరు మండల ప్రజల మాదిరిగానే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇతర ప్రాంతాల్లోని కొన్ని మండలాల ప్రజలు కూడా అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు కోసం జేఏసీ నేతృత్వంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలిసింది.

# ఎన్నికల లబ్ధి కోసమే హైడ్రామా

- మహిళా లోకానికి ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి
- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ




అక్షరదర్బార్, హైదరాబాద్: బీజేపీ ప్రభుత్వం మహిళలపై మొదటి నుంచి కపట ప్రేమ చూపిస్తూ, వారిని మోసం చేస్తోందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే బీజేపీ ప్రభుత్వం మహిళా బిల్లును అస్త్రంగా వాడుకుంటోందని స్వర్ణ విమర్శించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ నెల 16న బిల్లు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని, ఇది మహిళలను వంచించడమేనని అన్నారు. బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఈ పదేళ్లలో ఎందుకు అమలు చేయలేదని ఆమె ప్రశ్నించారు.

- రిజర్వేషన్ల క్రెడిట్ కాంగ్రెస్‌దే


మహిళా రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ 40 ఏళ్ల క్రితమే పునాదులు వేసిందని ఆమె గుర్తు చేశారు. స్వర్గీయ రాజీవ్ గాంధీ హయాంలోనే పార్లమెంట్, రాజ్యసభల్లో రిజర్వేషన్లపై చర్చ మొదలైందని తెలిపారు. మార్గరెట్ ఆల్వా కమిటీ ద్వారా విస్తృత చర్చలు జరిగాయని, 2010లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం రాజ్యసభలో బిల్లును ఆమోదింపజేసిందని చెప్పారు. 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి, 15 లక్షల మంది మహిళలను రాజకీయాల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం బీజేపీ తెస్తున్న చట్టం ప్రకారం.. జనగణన, డిలిమిటేషన్ ప్రక్రియ ముగిశాకే అంటే 2034 తర్వాతే రిజర్వేషన్లు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని, ఇది మహిళలను గాలికొదిలేయడమేనని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీ మహిళలకు కూడా ఈ రిజర్వేషన్లలో వాటా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.



## సామాన్య ప్రజల గొంతుక జనసేన పార్టీ

- చిట్యాలలో జనసైనికుల ఆత్మీయ సమ్మేళనం
- జేఎస్పీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: సనత్ కుమార్

అక్షర దర్బార్, చిట్యాల: జనసేన పార్టీ సామాన్య ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని భూపాలపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ పీఓసీ జెర్రీ పోతుల సనత్ కుమార్ అన్నారు. సోమవారం చిట్యాల మండల కేంద్రంలో అన్నారపు రమణ కుమార్ అధ్యక్షతన జనసైనికుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సనత్ కుమార్, జిల్లా నాయకులు కంకనాల దేవేందర్ మాట్లాడుతూ.. నిరుద్యోగం, రైతు సమస్యలు, ధరల పెరుగుదలపై జనసేన పోరాటం సాగిస్తోందన్నారు. ప్రతి జనసైనికుడు పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల మండల కోఆర్డినేటర్ జంగా మధుకర్, జనసేన కార్యకర్తలు మరియు వీరమహిళలు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రతా నియమాలు ప్రాణాలకు రక్షణ

- మర్రిపల్లి పంచాయతీ సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేసిన సర్పంచ్ సుజాత

అక్షర దర్బార్, దుగ్గొండి: రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని మర్రిపల్లి గ్రామ సర్పంచ్ డ్యాగం సుజాత అన్నారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు కట్టుకోవడం శ్రేయస్కరమని, అతివేగం మరియు మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ స్వంత ఖర్చుతో హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొయినుద్దీన్, పీఎస్ హెచ్ఎం రోజా రాణి, అంగన్ వాడి టీచర్ శ్రీలత, వార్డు సభ్యులు కుక్కమూడి కవిత, ఎరుకల పద్మ, గాజు శివాజీ, కుక్కమూడి రాజేందర్, వీఓ సీఏ వేల్పుల సుజాత, నాయకులు కామ శోభన్ బాబు, కామ కేశవరావు, గ్రామస్థులు కుంట రాజుకుమార్, దానం మొగిలయ్య, పొన్నాల మోహన్ రెడ్డి, డ్యాగం శివాజీ, గాజు నాగరాజు, కొత్తపెల్లి రమేష్, ఇట్టబోయిన ఐలయ్య, ఎరుకల సురేష్, రాధారపు స్వామి, పొన్నాల మల్లారెడ్డి, కన్నెబోయిన సురేష్, కుక్కమూడి లింగయ్య, రామగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడ పీహెచ్‌సీలో టీబీ వ్యాధి నిర్ధారణ శిబిరం

- 40 మంది అనుమానితుల నుండి నమూనాల సేకరణ: డాక్టర్ రవి

అక్షర దర్బార్, మరిపెడ: మరిపెడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం టీబీ (క్షయ) వ్యాధి నిర్ధారణ ప్రత్యేక కార్యక్రమం జరిగింది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో 40 మంది అనుమానితుల నుండి కఫం నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ.. ఈ నమూనాలను పరీక్షల కోసం జిల్లా కేంద్రానికి పంపుతున్నామని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి 6 నెలల పాటు ఉచిత మందులతో పాటు పోషకాహారం కోసం ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం ఉన్నవారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఆచార్యులు, ల్యాబ్ టెక్నీషియన్ అనిత, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన కట్కూరి రాధ - కీ.శే.కొమురయ్య కుమారుడు సాంబయ్య, రవళి వివాహ రిసెప్షన్ వేడుక సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారికి నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ ప్రెసిడెంట్ అల్లం రవీందర్, యూత్ అధ్యక్షుడు తౌటం నవీన్, ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్, చిట్యాల టౌన్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీధర్, సీనియర్ నాయకులు పాండ్రాల వీరస్వామి, చిలుముల రమణాచారి, కట్కూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అందరికీ ఆదర్శప్రాయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్

- ఆదర్శ పాఠశాలలో ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

అక్షర దర్బార్, చిట్యాల: సామాజిక సమానత్వం కోసం పోరాడిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని చిట్యాల ఆదర్శ పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపల్ మేకల రమేష్ అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. కులమత విభేదాలు లేని సమాజాన్ని నిర్మించేందుకు అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నీలం రవీందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, జోష్న, సమీరా, ఆయేషా, వాణి, శ్రీలత, స్వప్న, రాజు, శివ, ఖలీమ్, శ్రీకాంత్, భాస్కర్, సాగర్, రాజు, షబీరుద్దీన్, అశోక్, ఆరెపల్లి రాము మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యం వీడండి..

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- కాళోజి కళాక్షేత్రంలో ఘనంగా 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత సదస్సు
- వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం
- పాల్గొన్న కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, డా సత్య శారద, సీపీ సన్‌ప్రీత్ సింగ్

## సురక్షితంగా ఇంటికి చేరండి




అక్షరదర్బార్, హనుమకొండ : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించినప్పుడే కుటుంబాలకు శ్రేయస్కరమని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్లు, పోలీస్ కమిషనర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు మిగిల్చే శోకం వర్ణనాతీతమని, విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు కళ్లకు కట్టినట్లు ఉన్నాయని అభినందించారు. ముఖ్యంగా యువత ప్రాణాల విలువ తెలుసుకోవాలని, విద్యాసంస్థల్లో రోడ్డు భద్రతపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 13 నుంచి 18 వరకు కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "నో హెల్మెట్ – నో వెహికల్ ఎంట్రీ" నిబంధనను కఠినంగా అమలు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం వల్లే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### క్షేత్రస్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీలు

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామ స్థాయి వరకు రోడ్ సేఫ్టీ కమిటీలు వేసి ప్రతి నెల పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇంటింటా సర్వే ద్వారా హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డా సత్య శారద మాట్లాడుతూ.. గమ్యస్థానాలకు చేరడానికి ముందస్తు ప్రణాళిక ఉంటే అతివేగం అవసరం ఉండదని, ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను రక్షణ కవచంగా భావించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ రూపొందించిన "వేగం కన్నా ప్రాణం మిన్న" వీడియో గీతం అందరినీ ఆలోచింపజేసింది. కేయూ ఇంజనీరింగ్ విద్యార్థుల ఫ్లాష్ మాబ్, పోలీసుల కళాజాతా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

### అరైవ్ అలైవ్ చాంపియన్లకు సత్కారం

చాలా కాలంగా ఎలాంటి ప్రమాదాలు లేకుండా సురక్షితంగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను, ఉత్తమ సేవలందించిన ట్రాఫిక్ పోలీసులను 'అరైవ్ అలైవ్ చాంపియన్లుగా' గుర్తించి శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత ఎగ్జిబిట్లను అతిథులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు ధార కవిత, అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, రవి, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతను పరామర్శించిన సిరికొండ

- ఏ అవసరం ఉన్నా అండగా ఉంటా.. మాజీ స్పీకర్ భరోసా



అక్షర దర్బార్, చిట్యాల: ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటికి వచ్చిన చిట్యాల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ సీనియర్ నేత కోడల రాయమల్లును తెలంగాణ తొలి శాసనసభాపతి, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి సోమవారం పరామర్శించారు. రాయమల్లు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, ఎలాంటి ఇబ్బంది కలిగినా నేరుగా తనకు ఫోన్ చేయాలని, హైదరాబాద్‌కు వస్తే వైద్య సహాయం కోసం అన్ని తానే చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు చింతల రమేష్, పువ్వాడి హరికృష్ణ, ఉప్పుల కిరణ్, రాయని శ్రీకాంత్, శీను తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన చల్లా



అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలం నాగారం, మల్లక్కపేట గ్రామాలలో ఇటీవలే మృతిచెందిన బిఆర్ఎస్ నాయకులు సాదు రాములు, రాసమల్ల సురేందర్ కుటుంబాలను పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి

- నైన్ పాక సర్పంచ్

అక్షర దర్బార్, చిట్యాల: మండలంలోని నైన్ పాక గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ నక్క భాస్కర్ సోమవారం పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కూలీల ఆరోగ్యం దెబ్బతినకుండా ఆశా వర్కర్లతో కలిసి ఓఆర్ఎస్ ఎనర్జీ ప్యాకెట్లు, మందు బిళ్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ఆరోగ్యం బాగుంటేనే పనులు చేయగలమని, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డి రాములు, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నర్సంపేటలో 'అరైవ్ అలైవ్' ప్రాణ రక్షణ ఉద్యమం

- రోడ్డు భద్రతపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

అక్షర దర్బార్, నర్సంపేట: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నర్సంపేట పట్టణ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, ఎంఆర్ఓ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా హాజరయ్యారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అరైవ్ అలైవ్ అనేది ఒక ప్రాణ రక్షణ ఉద్యమమని, యువత అతివేగం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై గూడ అరుణ్, కౌన్సిలర్లు భూక్య మాతృ రాథోడ్, ఏవూరి శ్రీనివాస్ రెడ్డి, ఎలుకంటి విజయ్, వేముల సంధ్య సాంబయ్య గౌడ్, ముత్తినేని వెంకన్న, హనుమకొండ శ్రీధర్, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనిషా ప్రకాష్, కొత్తకొండ మేఘన శ్యామ్ రాజ్, కొంపెల్లి వీణ విజేందర్ రెడ్డి, మున్సిపల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## తహశీల్దార్ వసంతరావును కలిసిన కాంగ్రెస్ నేత ముఖిరాల

- జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మర్యాదపూర్వక భేటీ

అక్షర దర్బార్, చిట్యాల: కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండోసారి ఎన్నికైన చింతకుంటరామయ్యపల్లి మాజీ సర్పంచ్ ముఖిరాల మధువంశీకృష్ణ, సోమవారం చిట్యాల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన తూకుంట్ల వసంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. తహశీల్దార్‌ను శాలువాతో సన్మానించిన మధువంశీ.. మండలంలోని సమస్యల పరిష్కారం కోసం తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షులు అల్లకొండ కుమార్, టౌన్ అధ్యక్షుడు గంగాదరి రవీందర్, బీసీ సెల్ మండల అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నేతలు అల్లం రాజు, శనిగరం మొగిలి తదితరులు పాల్గొన్నారు.



# నర్సంపేటలో ఎస్ హెచ్ జీ సభ్యురాలి ఆత్మహత్యాయత్నం

○ లోన్ల కమీషన్లపై ప్రశ్నించినందుకు వేధింపులే కారణమని ఆరోపణ

అక్షర దర్బార్, నర్సంపేట: పట్టణ సమాఖ్య పరిధిలోని వల్లభ్‌నగర్‌కు చెందిన ఎస్.హెచ్.జీ సభ్యురాలు బూర్క రేష్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. బాధితురాలి భర్త కర్ణాకర్ కథనం ప్రకారం.. హాసిని కృష్ణ మహిళా సంఘంలో సభ్యురాలైన రేష్మ, సంఘం లోన్ల విషయంలో కమీషన్లు ఎందుకు ఎక్కువ అడుగుతున్నారని ఆర్పీని, గ్రూప్ లీడర్లను ప్రశ్నించింది. ఈ క్రమంలో వారు రేష్మను కులం పేరుతో దూషిస్తూ మానసిక క్షోభకు గురిచేశారని, దీంతో మనస్తాపం చెందిన ఆమె సోమవారం మాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించిందని ఆరోపించారు. ప్రస్తుతం ఆమె నర్సంపేటలోని వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# కాకతీయ హైస్కూల్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి


○ అంబేద్కర్ ప్రపంచం గర్వించదగ్గ మేధావి: కరస్పాండెంట్ రాజ్ మహమ్మద్

అక్షర దర్బార్, చిట్యాల: మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ ఎండి. రాజ్ మహమ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ.. కొలంబియా యూనివర్సిటీ ప్రకటించిన ప్రపంచంలోని మొదటి పదిమంది మేధావుల్లో అంబేద్కర్ ప్రథమ వరుసలో ఉండడం భారతీయులందరికీ గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఫరీద్ హజ్మీ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ భద్రయ్య


అక్షర దర్బార్, పరకాల: పట్టణంలోని వైనాల ప్రభాకర్–కవితల నూతన గృహప్రవేశం సందర్భంగా మాజీ 22వ వార్డు కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వధూవరులకు వస్త్రాలను బహుకరించిన ఆయన మాట్లాడుతూ.. తాను కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో ప్రభాకర్ కుటుంబానికి ఇల్లు మంజూరు చేయించామని, నేడు ఆ ఇల్లు పూర్తి చేసుకుని గృహప్రవేశం చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



# పేద వృద్ధ మహిళలకు చీరల పంపిణీ..

○ గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ సేవలకు గ్రామస్థుల ప్రశంసలు

అక్షరదర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలో పేద వృద్ధ మహిళలకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. సోమవారం హుజురాబాద్‌కు చెందిన ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ సమక్షంలో బండి రేణుక–శంకర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు.మంచానికే పరిమితమై నడవ లేని, ఎలాంటి ఆధారం లేని 12 మంది వృద్ధ మహిళల ఇళ్లకు స్వయంగా వెళ్లి చీరలు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ,



గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ప్రతిరోజూ భోజనాలు అందిస్తున్నారని తెలుసుకుని, తమ వంతు సహాయంగా చీరల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.సర్పంచ్ బండి రేణుక–శంకర్ మాట్లాడుతూ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అమోఘమని, గ్రామ వృద్ధులకు ఈ సహాయం ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. గ్రామం తరఫున ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు రమాకాంత్, పొన్నం చారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

○ ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గుంపెల్లి మునీశ్వర్ డిమాండ్

అక్షర దర్బార్, నర్సంపేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గుంపెల్లి మునీశ్వర్ డిమాండ్ చేశారు. నర్సంపేటలో గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న ఆర్టిజన్లకు ఆయన సంఘీభావం తెలిపారు. ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ వర్తింపజేయాలని, క్వాలిఫికేషన్ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడకుండా చర్చలు జరపాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు




సలీంపాష, జాయింట్ సెక్రటరీ పాపిరెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ దేవేందర్, నాయకులు సాంబయ్య, మాధవరావు, మొగిలి, కృష్ణ, భాను తదితరులు పాల్గొన్నారు.

# నగర సంకీర్తనతో హిందూ సమ్మేళనం ప్రచారం

○ ఏప్రిల్ 28 సమ్మేళనానికి ఆహ్వానం

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో హిందూ సమ్మేళనం జాగరణ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నగర సంకీర్తన కార్యక్రమం భక్తి వాతావరణంలో నిర్వహించారు. గంద్రవాడలోని ఉమా మహేశ్వర దేవస్థానం నుండి ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు సాగిన ఈ సంకీర్తనలో భక్తులు పాల్గొన్నారు.కమిటీ అధ్యక్షులు రాజేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు మాడుగుల పాపి రెడ్డి, భక్తమండలి సభ్యులు రాజేశ్వర్ రావు, నరేందర్, సతీష్, పాపన్నతో పాటు హిందూ బంధువులు భారీగా పాల్గొన్నారు. గంద్రవాడ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం సి.ఎస్.ఐ కాలనీ మీదుగా శివాలయం వరకు కొనసాగింది. అనంతరం పరకాల ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో వాకర్లకు హిందూ సమ్మేళన సమితి సభ్యులు ఆహ్వానం అందించారు. సమితి గౌరవ



అధ్యక్షులు డా. విద్యాసాగర్, అధ్యక్షులు రాజేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు మాడుగుల పాపి రెడ్డి, సభ్యులు నరేందర్, సతీష్, పాపన్న, సంబశివుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏప్రిల్ 28, 2026న నిర్వహించనున్న "హిందూ ధర్మ సమ్మేళనం" కార్యక్రమానికి హిందూ బంధువులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు. ఈ సమ్మేళనానికి సద్గురువు మహాదేవ స్వామీజీ, లింగం సుధాకర్ రెడ్డి, నీలం నిర్మల తదితరులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అక్షర దర్బార్, శాయంపేట: రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి కనీస బాధ్యతని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారానే ప్రాణాలను కాపాడుకోగలమని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శాయంపేట రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం వంటి చిన్న జాగ్రత్తలు పెద్ద ప్రమాదాల నుండి రక్షిస్తాయని తెలిపారు. ప్రజల్లో ఇటువంటి చైతన్యం తీసుకురావడానికి 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రంజిత్ రావు, ఎస్సై పరమేశ్వర్, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# డీసీసీ బ్యాంకు ప్రారంభం

○ మక్కల కొనుగోలు కేంద్రం కూడా...

అక్షరదర్బార్, సంగెం: సంగెం మండల కేంద్రంలో మక్కల కొనుగోలు కేంద్రం, డీసీసీ బ్యాంకు శాఖను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా సత్యశారద సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం రైతులకు ఎంతో మేలు చేస్తుందని, ఈ కేంద్రం ద్వారా రైతులు తమ పంటలను నేరుగా విక్రయించి సరైన ధరలు పొందే అవకాశం కలుగుతుందని, మధ్య వర్తుల సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు. డీసీసీ బ్యాంకులో ఎస్‌బీఐ తరహాలో ఆన్‌లైన్ సేవలు అందిస్తే లావాదేవీలు పారదర్శకంగా ఉండటంతో పాటు రికార్డులు భద్రంగా ఉంటాయని, ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. డీసీసీ బ్యాంకు సీఈఓ వజీర్ సుల్తాన్ మాట్లాడుతూ, సంగెం మండలంలో 33వ శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందని, రైతులకు మెరుగైన సేవలు అందించడంలో బ్యాంకు ముందంజలో ఉంటుందని అన్నారు. జిల్లా సహకార అధికారి (డీసీఓ) నీరజ, డీసీసీ సొసైటీ చైర్మన్ కుమారస్వామి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, సంగెం సర్పంచ్ లలిత, రైతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భద్రతపై అవగాహన కార్యక్రమం

○ "అరైవ్ అలైవ్"లో సీఐ క్రాంతి కుమార్

○ ట్రాఫిక్ నియమాల పాటనపై ప్రతిజ్ఞ

అక్షరదర్బార్, పరకాల: పరకాల మండలం అలియాబాద్, కామారెడ్డి పల్లి గ్రామాల్లో సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరకాల సీఐ క్రాంతి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి రోడ్డు రవాణా నియమాలను పాటించాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రోడ్డు భద్రతపై అవగాహన అత్యంత అవసరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రయాణంలో నిర్లక్ష్యం ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించిన సీఐ, హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం వంటి భద్రతా చర్యలను కచ్చితంగా పాటించాలని కోరారు. యువత బాధ్యతతో వాహనాలు నడపాలని, వేగ నియంత్రణ ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అలియాబాద్ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ పటేల్, కామారెడ్డి పల్లి సర్పంచ్ చిర్ర అనిత రాజయ్య, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# హైబోతుపల్లిలో ఘోరం

○ రేషన్ షాపు వద్ద మహిళపై దాడి

○ కర్ర విరిగిపోయేలా బాదిన నిందితుడు

○ "మా వాళ్లే అధికారులు" అంటూ బెదిరింపులు

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లా పరకాల మండలం హైబోతుపల్లి గ్రామంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. ఈ నెల 9న రేషన్ షాపు వద్ద క్యూలో నిల్చున్న ఒక అమాయక మహిళపై ఓ వ్యక్తి దాడికి తెగబడ్డాడు. కళ్లముందే దాడి జరుగుతున్నా అడ్డుకోలేకపోయిన స్థానికులు, నిందితుడి ప్రవర్తనతో భయాందోళనకు గురవుతున్నారు. బాధితురాలి కథనం ప్రకారం గ్రామానికి చెందిన దేవరనేని సంధ్య అనే మహిళ రేషన్ తీసుకోవడానికి క్యూలో నిల్చున్న సమయంలో, అక్కడే ఉన్న తాటికొండ రాజయ్య అనే వ్యక్తి ఆమెపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ దూషించడం మొదలుపెట్టాడు. తనను ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించినందుకు, మొదట బండ రాయితో ఆమెపై దాడి చేశాడు. అంతటితో ఆగకుండా, పక్కనే ఉన్న పెద్ద కర్రను తీసుకుని బాధితురాలిని సుమారు 10 నుండి 15 సార్లు చితకబాదాడు. మహిళను రక్షించడానికి రేషన్ డీలర్ రఘుపతి ప్రయత్నించగా, నిందితుడు



అతనిపై కూడా విరుచుకుపడ్డాడు. అసభ్య పదజాలంతో దూషిస్తూ వీరంగం సృష్టించాడు.

**పాత కక్షలతో వేధింపులు**

బాధితురాలు సంధ్య తన తల్లితో కలిసి నివసిస్తోంది. ఇంట్లో మగదిక్కు ఎవరూ లేరనే విషయాన్ని ఆసరాగా చేసుకుని రాజయ్య గత కొంతకాలంగా వేధింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఇంటి చుట్టూ తిరుగుతూ, అసభ్యంగా ప్రవర్తిస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నాడని కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే విడిచిపెట్టారు. బయటకు వచ్చిన రాజయ్య.. నేరుగా వచ్చి బెదిరింపులకు దిగినట్లు బాధితురాలు తెలిపారు. పోలీస్ అధికారులు మావాళ్లే అని నీచంగా మాట్లాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణ భయంతో గడుపుతున్న తమకు రక్షణ కల్పించాలని బాధితురాలు, ఆమె తల్లి కోరుతున్నారు.

# రైస్ మిల్లింగ్ పాలసీపై మిల్లర్ల గళం

○ సహజ నష్టాలకు మమ్మల్ని బాధ్యులను చేయడం సరికాదు

○ ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్

అక్షర దర్బార్, ములుగు: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 'రైస్ కస్టమ్ మిల్లింగ్ పాలసీ 2025-26'లోని నిబంధనలు మిల్లర్లకు భారంగా మారాయని రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మిల్లర్లతో కలిసి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ.. కొత్త పాలసీలో పారదర్శకత లోపించిందని, అధికారులకు విశేష అధికారాలు కట్టబెట్టి మిల్లర్ల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ బ్యాంక్ గ్యారెంటీలు, సెక్యూరిటీ డిపాజిట్ల వల్ల చిన్న మిల్లర్లు ఆర్థికంగా చితికిపోతున్నారని పేర్కొన్నారు. తేమ శాతం, సహజ నష్టాలకు మిల్లర్లను బాధ్యులను చేస్తూ క్రిమినల్ కేసులు నమోదు చేసే నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. 100 శాతం సీఎంఆర్ డెలివరీ నిబంధనను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ గురిజాల సహోదర్ రెడ్డి, ట్రెజరర్ యెలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్ జిల్లాలోని రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత కోసం 'రహవీర్' కమిటీ ఏర్పాటు

○ అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరం:ఎస్సై సతీష్

అక్షర దర్బార్, చిట్యాల: పోలీసు శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి ఉందని చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రహదారులు బాగున్నాయని వాహనదారులు అతివేగంతో ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నారని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం ప్రాణాపాయమని హెచ్చరించారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని 'గోల్డెన్ అవర్' (గంటలోపు)లో ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడిన వారవుతారని తెలిపారు.

# విద్యుత్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలి

○ సమ్మె శిబిరానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంఘీభావం

○ ఎన్నికల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శ

అక్షర దర్బార్, నర్సంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నర్సంపేట విద్యుత్ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేస్తున్న విద్యుత్ కార్మికుల శిబిరాన్ని ఆయన సందర్శించి, బీఆర్ఎస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ.. ఆర్టిజిన్లు, అన్ మ్యాన్డ్, పీస్ రేట్, స్పాట్ బిల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యల కోసం గత పది రోజులుగా పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గెజిట్ తీసుకువస్తే, కాంగ్రెస్ నేతలు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలు పాదయాత్రలో ఇచ్చిన హామీని రెండున్నరేళ్లు గడుస్తున్నా నెరవేర్చలేదన్నారు. 25 వేల మంది ఆర్టిజన్లను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా నాయకులు, బిఆర్ పీయు జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్లు, పట్టణ పార్టీ బాధ్యులు, వార్డు అధ్యక్షులు, విద్యుత్ కార్మిక సంఘాల నాయకులు, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

